batukammanews.com
TEL/2019/78873
# బతుకమ్మ
తాజా వార్తల సద్దిమూట
5 ఆగస్టు 2026
బుధవారం

## కృష్ణమ్మ ఉప్పెనతో నీటిలో కలిసిన సంగమేశ్వర ఆలయం



వెబ్ డెస్క్, బతుకమ్మ :శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో ఉన్న ప్రసిద్ధ సంగమేశ్వర స్వామి ఆలయం మరోసారి కృష్ణానది జలాల్లో మునిగిపోయింది. కృష్ణానదికి వరద ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం వేగంగా పెరిగి ప్రస్తుతం 849 అడుగులకు చేరుకుంది. దీంతో ఆలయ గర్భగుడిలోకి నీరు ప్రవేశించి, ఆలయం జలసమాధి అయింది.

02

# సింగరేణికి చారిత్రక విజయం..!

## సింగరేణి విస్తరణకు మరో కీలక అడుగు

### 12 ఏళ్ల తర్వాత సింగరేణికి కొత్త బొగ్గు బ్లాక్

### ప్రజా ప్రభుత్వ చొరవతోనే ఈ చారిత్రక విజయం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సింగరేణి సంస్థ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, తెలంగాణ ఇంధన భద్రతను మరింత పటిష్ఠం చేసే విజయం సాధించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు ఏరియాకు అత్యంత కీలకమైన పీకే ఓసీ-2 డిప్ సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రక ఘట్టమన్నారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత సింగరేణికి కొత్త బొగ్గు బ్లాక్ లభించడం సంస్థ చరిత్రలో మైలురాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని పరిరక్షించి, విస్తరించాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వం సింగరేణిని వేలంలో పాల్గొనకుండా నిర్లక్ష్యం చేయడంతో రాష్ట్రంలోని కీలక బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లాయని, ప్రస్తుత ప్రభుత్వం చొరవతో సింగరేణికి మళ్లీ కొత్త బ్లాక్ దక్కిందన్నారు.

02

- వెబ్ డెస్క్, బతుకమ్మ

పీకే ఓసీ-2 డిప్ సైడ్ గనిలో 120 మిలియన్ టన్నుల జీ-8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉందన్నారు. దీంతో తెలంగాణ విద్యుత్ రంగానికి దీర్ఘకాలిక బొగ్గు సరఫరా భద్రత లభిస్తుందని, రాష్ట్ర ఇంధన భద్రత మరింత బలోపేతం అవుతుందని వివరించారు. మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని కాపాడటంలో ఈ బ్లాక్ కీలకంగా మారనుందని, 2 వేల మందికి పైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ కు అనుమతులు సాధించేందుకు స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో చర్చించి సమస్యలు పరిష్కరించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తుచేశారు.





02

## బస్‌స్టాండ్‌ను ఆధునీకరించాలి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ బస్ స్టాండ్ ఆధునీకరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నూతన బస్ స్టాండ్ స్థలం కేటాయించాలని అనేక సార్లు మంత్రులను కలిసినట్లు గుర్తుచేశారు. అప్పటి వరకు ప్రస్తుత బస్ స్టాండ్ ను సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. ప్రయాణికుల కోసం విశాలమైన వేచియుండే హాలు ఏర్పాటు చేయాలని, బస్సుల రాకపోకల సమాచారాన్ని అందించే డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సీసీ కెమెరాలను, తగిన సిబ్బందిని నియమించాలన్నారు. ప్రైవేటు వాహనాలు, ఆటో రిక్షాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు.

## జనన - మరణ ధృవీకరణ పత్రాల జారీలో

# కొత్త నిబంధనలు

02

హైదరాబాద్, బతుకమ్మ :జనన, మరణ ధృవీకరణ పత్రాల నమోదులో పారదర్శకత పెంచేందుకు, నకిలీ సర్టిఫికెట్ల జారీని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ఆలస్యంగా నమోదయ్యే కేసుల్లో ఇకపై మరింత కఠినమైన విధానాన్ని అమలు చేయనుంది. కొత్త నిబంధనల ప్రకారం, జననం లేదా మరణం జరిగిన తేదీ నుంచి రెండేళ్లు దాటిన తర్వాత నమోదు చేయాలంటే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (జెఎంఎఫ్సి) కోర్టు ఉత్తర్వులు తప్పనిసరి. కోర్టులో అఫిడవిట్‌తో పాటు అవసరమైన ఆధారాలు సమర్పించిన తర్వాత మేజిస్ట్రేట్ అనుమతి మేరకు మాత్రమే ధృవీకరణ పత్రం జారీ అవుతుంది.

## బోండీ ఘటనలో

# ధైర్యసాహసాలకు గుర్తింపు

### రహ్మాత్ పాషాను అభినందించిన కేటీఆర్



02

## సీఎంఆర్ ధాన్యం నిర్వహణలో

# పూర్తి పారదర్శకత పాటించాలి

### పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :సీఎంఆర్ ధాన్యం, బియ్యం నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హెచ్చరించారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) రైస్ మిల్లుల్లో చోటుచేసుకున్న అవకతవకలకు సంబంధించి నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై మంగళవారం సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు.




02

# బోండీ ఘటనలో ధైర్యసాహసాలకు గుర్తింపు

హైదరాబాద్, బతుకమ్మ :ఆస్ట్రేలియాలోని బోండీ ప్రాంతంలో జరిగిన విషాద ఘటన సమయంలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి పలువురి ప్రాణాలను కాపాడిన హైదరాబాద్‌కు చెందిన భారతీయ మూలాల వ్యక్తి రహ్మాత్ పాషాకు ఆస్ట్రేలియా ప్రభుత్వం శాశ్వత నివాస హోదా కల్పించడం గర్వకాం ణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) పేర్కొన్నారు. ఈ సందర్భంగా రహ్మాత్ పాషాను ప్రత్యేకంగా అభినందించిన కేటీఆర్, ఆయన ప్రదర్శించిన ధైర్యం, సేవాభావం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి ఖ్యాతిని మరింత పెంచేలా ఆయన చేసిన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. బోండీ బీచ్ సమీపంలో ఒక ప్రయాణికుడిని దింపిన అనంతరం పెద్ద శబ్దాలు వినిపించడంతో మొదట వాటిని బాణాసంచా శబ్దాలుగా భావించిన రహ్మాత్ పాషా, అనంతరం అక్కడ దుండగుడు దాడికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆ సమయంలో ప్రాణభయంతో పరుగులు తీస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, గాయపడిన వారికి సహాయం చేయడం ద్వారా దాదాపు 20 మంది ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడైంది. రహ్మాత్ పాషా చూపిన ధైర్యసాహసాలను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆయనకు పర్మినెంట్ రెసిడెన్సీ మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ బ్రేవరీ అవార్డు కు కూడా నామినేట్ చేసినట్లు సమాచారం. అలాగే ఆయన సేవలను ఆయన పనిచేసిన రైడ్–షేరింగ్ సంస్థ కూడా ప్రత్యేకంగా గుర్తించి అభినందించింది. సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేయాలనే సందేశాన్ని రహ్మాత్ పాషా తన ఆచరణ ద్వారా చాటిచెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. ధైర్యం, మానవత్వం, సేవాభావంతో ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకోవడం ప్రతి తెలుగు వ్యక్తికి గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నిశీధర్ బొర్రా, వేణు తదితరులు పాల్గొని రహ్మాత్ పాషాను ఘనంగా సన్మానించారు. సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేసే ప్రతి ఒక్కరికీ రహ్మాత్ పాషా ఆదర్శంగా నిలుస్తారని వారు పేర్కొన్నారు.

# సింగరేణికి చారిత్రక విజయం ..!

ప్రస్తుతం అక్కడ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమై, రాబోయే 36 సంవత్సరాల పాటు సింగరేణికి బలమైన ఆధారంగా నిలుస్తోందన్నారు. అలాగే తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, ప్రజా ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరిపి మైనింగ్ లీజులు మంజూరు చేయించిందన్నారు. ఈ గని ద్వారా 336 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను 45 సంవత్సరాల పాటు వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కోయగూడెం–3, సత్తుపల్లి–3 వంటి కీలక బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లాయన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణిని మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు బ్లాక్‌లను సాధించడం, ఉద్యోగ భద్రతను పెంపొందించడం, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలిక బొగ్గు సరఫరా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మణుగూరు పీకే ఓసీ–2 డిప్ సైడ్ బ్లాక్ దక్కడంపై సింగరేణి యాజమాన్యానికి, కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులందరికీ డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కోయగూడెం–3, సత్తుపల్లి–3 బ్లాక్‌లను కూడా సింగరేణికి దక్కేలా కృషి చేస్తామని, ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనుల సాధనతో పాటు క్రిటికల్ మినరల్స్ అన్వేషణలోనూ సింగరేణి విస్తరణకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.ఖ

### సీఎంఆర్ ధాన్యం నిర్వహణలో

# పూర్తి పారదర్శకత పాటించాలి

సమావేశంలో ఇప్పటివరకు నమోదైన కేసుల దర్యాప్తు స్థితి, స్వాధీనం చేసుకున్న ధాన్యం, బియ్యం, సంబంధిత రికార్డుల పరిశీలన, నిందితులపై చేపడుతున్న చట్టపరమైన చర్యలు, మిగిలిన కేసుల విచారణను వేగవంతం చేయాల్సిన అవసరం వంటి అంశాలను కమిషనర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సివిల్ సప్లై శాఖ అధికారులు, పోలీసు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి అవకతవకలు పునరావృతం కాకుండా నిరంతర తనిఖీలు నిర్వహించి, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం. శ్రీకాంత్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేష్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ అరవింద్ రెడ్డి, రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు దయానంద్ గుప్తా, రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ కార్యదర్శి వడ్డీ మోహన్ రెడ్డి తదితర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# జనన - మరణ ధృవీకరణ పత్రాల జారీలో కొత్త నిబంధనలు

ఈ ప్రక్రియ ఇకపై భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), 2023 నిబంధనలకు అనుగుణంగా కొనసాగనుంది. గతంలో అమల్లో ఉన్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ), 1973 స్థానంలో కొత్త చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు. ఆలస్య నమోదులకు కూడా దశలవారీ నిబంధనలు అమలులో ఉంటాయి. 21 రోజుల లోపు ఎలాంటి రుసుము లేకుండా నమోదు చేసుకోవచ్చు. 21 నుంచి 30 రోజుల మధ్య ఆలస్య రుసుముతో నమోదు చేయవచ్చు. 30 రోజుల నుంచి ఏడాది లోపు సంబంధిత అధికారుల అనుమతి అవసరం కాగా, ఒకటి నుంచి రెండేళ్లలోపు నమోదులకు సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డిఎం) లేదా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరి. జనన ధృవీకరణ పత్రం విద్య, ఆధార్, పాస్‌పోర్ట్, సంక్షేమ పథకాలు, వారసత్వ హక్కులు వంటి అనేక అవసరాలకు కీలకమైనది. మరణ ధృవీకరణ పత్రం బీమా, పెన్షన్, ఆస్తి, ఇతర చట్టపరమైన వ్యవహారాల్లో అవసరమవుతుంది. అందువల్ల జననం లేదా మరణం జరిగిన వెంటనే సంబంధిత స్థానిక సంస్థలో నమోదు చేయించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

# బస్ స్టాండ్‌ను ఆధునీకరించాలి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :
నిజామాబాద్ బస్ స్టాండ్ ఆధునీకరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నూతన బస్ స్టాండ్ స్థలం కేటాయించాలని అనేక సార్లు మంత్రులను కలిసినట్లు గుర్తుచేశారు. అప్పటి వరకు ప్రస్తుత బస్ స్టాండ్ ను సౌకర్యాలను మెరుగుపర్చాలన్నారు. ప్రయాణికుల కోసం విశాలమైన వేచియుండే హాలు ఏర్పాటు చేయాలని, బస్సుల రాకపోకల సమాచారాన్ని అందించే డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సీసీ కెమెరాలను, తగిన సిబ్బందిని నియమించాలన్నారు. ప్రైవేటు వాహనాలు, ఆటో రిక్షాల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు.ల



# ప్రేమ్ సాగర్ రావు రుణాల వ్యవహారం

### సీఎం సమాధానం చెప్పాలని బీజేపీ డిమాండ

హైదరాబాద్, బతుకమ్మ :కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆర్థిక వ్యవహారాలపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ వెర్రబెల్లి రఘునాథ్ రావు పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తక్కువ కాలంలోనే భారీ మొత్తంలో బ్యాంకు అప్పులు ఎలా తీర్చగలిగారో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌ను ప్రస్తావించిన రఘునాథ్ రావు, ఆ అఫిడవిట్ ప్రకారం ప్రేమ్ సాగర్ రావు మొత్తం ఆస్తులు రూ.54 కోట్లు, అప్పులు రూ.12 కోట్లు, వార్షిక ఆదాయం రూ.34 లక్షలు మాత్రమేనని పేర్కొన్నారు. అలాగే ఆదాయపు పన్ను శాఖకు చెల్లించాల్సిన బకాయిలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, గతంలో బ్యాంకుల వద్ద డిఫాల్టర్‌గా ఉండి ఎన్‌సీఎల్టీ (ఎన్సిఎల్టి)లో కేసులు ఎదుర్కొన్న వ్యక్తి కేవలం 16 నెలల వ్యవధిలోనే తొమ్మిది బ్యాంకులకు కలిపి రూ.470 కోట్ల అప్పులు ఎలా చెల్లించారనే అంశంపై సమాధానం చెప్పాలని రఘునాథ్ రావు కోరారు. అలాగే రియల్ ఎస్టేట్ కంపెనీకి సంబంధించిన రూ.357 కోట్లు, హోటల్ వ్యాపారానికి సంబంధించిన రూ.87 కోట్ల రుణాలను ఏ విధంగా క్లియర్ చేశారని ప్రశ్నించారు. బంజారాహిల్స్‌లోని ఒక బ్యాంకుకు ఒకేసారి రూ.120 కోట్లు చెల్లించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) ఎలా పొందారో కూడా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం వెనుక ఏదైనా మంత్రి ప్రమేయం ఉందా అనే అనుమానాన్ని కూడా రఘునాథ్ రావు వ్యక్తం చేశారు. ఇటీవల మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు మంచిర్యాలలో బస చేసిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, ఈ అంశంపై ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆయన కోరారు. అయితే, బీజేపీ నేత చేసిన ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ లేదా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నుంచి తక్షణ స్పందన వెలువడలేదు. ఈ ఆరోపణలపై వారి వివరణ రావాల్సి ఉంది.

### అంగన్వాడీ కేంద్రంలో

# తల్లిపాల వారోత్సవాలు...

రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్ - 8 లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పద్మ , గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.




# కృష్ణమ్మ ఉప్పెనతో నీటిలో కలిసిన సంగమేశ్వర ఆలయం

సాధారణంగా శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 841 అడుగులకు చేరగానే సంగమేశ్వర ఆలయ గర్భగుడిలోకి నీరు ప్రవేశించడం ప్రారంభమవుతుంది. నీటిమట్టం 867 అడుగులకు చేరుకుంటే ఆలయం పూర్తిగా నీటిలో మునిగిపోతుంది. ప్రస్తుతం నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో భక్తుల దర్శనాలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. జలాశయంలో నీటి మట్టం తగ్గిన తర్వాతే ఆలయం తిరిగి దర్శనానికి అందుబాటులోకి వస్తుంది. సాధారణంగా మరో ఎనిమిది నెలల తర్వాత నీటిమట్టం తగ్గడంతో భక్తులకు ఆలయ ప్రవేశం లభించే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో కృష్ణానదికి వరదలు రావడంతో శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లోని సంగమేశ్వర ఆలయం నీటిలో మునిగిపోవడం, వేసవి కాలంలో నీటిమట్టం తగ్గిన తర్వాత తిరిగి వెలుగులోకి రావడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ విశిష్ట దృశ్యాన్ని చూసేందుకు, ఆలయం దర్శించేందుకు ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ లను తక్షణమే విడుదల చేయాలి





## బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన "ఫీజు బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిజామాబాద్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో తిరుమల మెడికల్ కాలేజీలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి మిస్డ్ కాల్, క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్ పాల్గొన్నారు.

అనంతరం వంశీ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌ల విడుదలలో విఫలమైందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు అప్పులు చేసి చదువులు కొనసాగించే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేవైఎం పోరాటం కొనసాగుతుందని వంశీ గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న "ఫీజు బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, మిస్డ్ కాల్, క్యూఆర్ కోడ్ ద్వారా సంతకం చేసి తమ డిమాండ్‌కు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని బీజేవైఎం నాయకులు హెచ్చరించారు. జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చొరవ చూపి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మారెడ్డి వనిత, జిల్లా నాయకులు విపుల్ రావు, రాజ్ గణేష్, రాకేష్, యువ మోర్చా మండల అధ్యక్షుడు రమణ, ఇతర నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్న గాయమైనా నిర్లక్ష్యం చేయకూడదు

## జనరల్ సర్జన్ డా.మనోజ్ కుమార్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఒక చిన్న గాయాన్ని నిర్లక్ష్యం చేస్తే అది సెల్యులైటిస్‌గా మారి తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని మెడికవర్ హాస్పిటల్స్, నిజామాబాద్ జనరల్ సర్జన్ డా.మనోజ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో డయాబెటిస్, రక్తప్రసరణ సమస్యలు, గాయాలు, పాదాల పరిశుభ్రత లోపించడం వంటి కారణాలతో సెల్యులైటిస్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్యులైటిస్ అనేది చర్మం, చర్మం కింద ఉండే మృదు కణజాలంలో బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ అని, సాధారణంగా కాళ్లు, పాదాలు, చేతుల్లో ఈ ఇన్ఫెక్షన్ ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. చిన్న గాయం, గీత, పగుళ్లు, పురుగు కాటు వంటి వాటి ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుందని, ముఖ్యంగా మధుమేహం, ఊబకాయం, రక్తప్రసరణ లోపం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

. . . ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త

సెల్యులైటిస్ ప్రారంభ దశలో కాలు లేదా ప్రభావిత భాగం ఎర్రగా మారడం, వాపు రావడం, నొప్పి, వేడిగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని, కొందరిలో జ్వరం, వణుకు, అలసట కూడా ఉండవచ్చని, ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ఇన్ఫెక్షన్ వేగంగా వ్యాపించి తీవ్ర సమస్యలకు దారితీయవచ్చని తెలిపారు.

. . . నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే

సమయానికి చికిత్స తీసుకోకపోతే ఇన్ఫెక్షన్ రక్తంలోకి చేరి సెప్సిస్, నెక్రోటైజింగ్ ఫాసియాటిస్, గ్యాంగ్రీన్ వంటి ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయవచ్చని, కొన్నిసార్లు చర్మం, కండరాలు దెబ్బతిని శస్త్రచికిత్స చేయాల్సిన పరిస్థితి కూడా రావచ్చన్నారు. అందుకే చిన్న గాయమైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని తెలిపారు.

. . . నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గాయాలను పరిశుభ్రంగా ఉంచాలని, డయాబెటిస్ ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచాలని, పాదాల్లో గాయాలు, పగుళ్లు ఉంటే వెంటనే చికిత్స తీసుకోవాలన్నారు. అలాగే పరిశుభ్రమైన పాదరక్షలు ధరించాలని, చర్మంపై గాయాలు లేదా ఇన్ఫెక్షన్ కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు.

. . . త్వరగా గుర్తిస్తే బెటర్

కాలు ఎర్రబడటం, వాపు, నొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే జనరల్ సర్జన్‌ను సంప్రదిస్తే ప్రారంభ దశలోనే యాంటీబయోటిక్స్ తో చికిత్స చేసి పూర్తిగా నయం చేయవచ్చన్నారు. చికిత్సలో ఆలస్యం చేస్తే ఇన్ఫెక్షన్ తీవ్రరూపం దాల్చి శస్త్రచికిత్స అవసరమయ్యే పరిస్థితి కూడా రావచ్చుని, ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు చిన్న గాయాన్నైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

# ఇల్లు కూలిన నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల అండ

## నిరుపేద కుటుంబాన్ని ఆదుకున్న బీఆర్ఎస్ నాయకులు

## ఇల్లు కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సాయం, బియ్యం పంపిణీ





బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 4 వ వార్డు ఇస్లాంపురా కాలనీలో నివసిస్తున్న ఓ నిరుపేద కుటుంబం ఉంటున్న ఇల్లు అకస్మాత్తుగా కూలిపోవడంతో వారు నిరాశ్రయులయ్యారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించినప్పటికీ, ఇంట్లోని సామగ్రి ధ్వంసమై కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ప్రస్తుతం తలదాచుకునే స్థలం లేక బాధిత కుటుంబం దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతు ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యాన్ని అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా షేక్ జుబేర్ బాన్సువాడ ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాన్ని తాత్కాలికంగా తాడ్కోల్ డబుల్ బెడ్‌రూమ్ గృహాలకు తరలించి, అవసరమైన ప్రభుత్వ సహాయ చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వం బాధిత కుటుంబానికి అత్యవసర ఆర్థిక సాయం అందించడంతో పాటు శాశ్వత గృహాన్ని మంజూరు చేసి అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఫెరోజ్ ఖాన్, మాక్బూల్, మాజీ కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు అక్బర్, మైనారిటీ సెల్ నాయకుడు ఇసాక్, బీఆర్ఎస్ నాయకులు రమేష్ యాదవ్, మొహమ్మద్ షఫీ, ఖాదర్, సీనియర్ నాయకుడు ఉస్మాన్, గంగారాం, ఖాలేద్, అఫ్జల్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం అభినందనీయం

## పోలీస్ కమిషనర్ సాయి చైతన్య




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రకృతి వైపరీత్యాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం అభినందనీయమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అంకితభావంతో సేవలందించిన ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. మంగళ వారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్ఐ డి. జక్రయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి. సాయి బాబాను శాలువాలతో సత్కరించి వారి సేవలను ప్రశం సించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్ రెహమాన్ హోటల్ నుంచి నిజాం ప్యాలెస్ ఫంక్షన్ హాల్ వరకు బోధన్ ప్రధాన రహదారిపై వరద నీరు భారీగా నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఆరవ టౌన్ ఎస్సై కే.సందీప్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ డి. జక్రయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి. సాయి బాబా వెంటనే స్పందించి ట్రాఫిక్‌ను సమర్థవం తంగా నియంత్రిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చర్య లు చేపట్టారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయిన విషయాన్ని గుర్తించిన పోలీసులు సంబం ధిత శాఖ అధి కారులతో సమన్వయం చేసి జేసీబీల సహాయంతో ఉద యం నుంచి సాయంత్రం వరకు డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేయిం చారు. పనులు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి పర్యవేక్షిస్తూ రహదా రులపై నిలిచిన నీ రు త్వరగా తొలగేలా చర్యలు తీసుకున్నారు. ఈ సేవల ను గుర్తించిన సీపీ మాట్లాడుతూ, ప్రజాసేవే పోలీసు శాఖ ప్రధాన లక్ష్య మని పేర్కొం టూ, ఇదే సేవాస్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజలకు అం డగా నిలవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యా దవ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఆరవ టౌన్ ఎస్సై సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర



కామారెడ్డి, బతుకమ్మ :జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సూచిం చారు. ఈ సందర్భంగా ఆయన పెద్ద చెరువు, జీఆర్ కాలనీ బ్రిడ్జి సహా వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిస్థితులను సమీక్షించారు. సంబంధిత అధికారులకు అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ రక్షణే పోలీసు శాఖకు ప్రథమ ప్రాధాన్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. వాగులు, చెరువులు, కల్వర్టులు, వరద ప్రవాహాల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని హెచ్చరించారు. అలాగే సెల్ఫీలు, వీడియోల కోసం ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకో వద్దని సూచించారు. తల్లిదండ్రులు చిన్నారులపై ప్రత్యేక నిఘా ఉంచా లనీ, అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, సుభాష్ రోడ్ చౌరస్తా వద్ద వరద నీటిలో చిక్కుకున్న పెళ్లి బస్సులోని 45 మంది ప్రయాణికులను కామారెడ్డి టౌన్ పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సురక్షితంగా రక్షించారు. ఈ సేవలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా డయల్ 100ను సంప్రదించాలని జిల్లా పోలీసు శాఖ ప్రజలకు సూచించింది.

# విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన సర్పంచ్



రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండలం అంబం నుంచి బోధన్ పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు సమస్య వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం 4 గంటలకు కళాశాలలు ముగిసినా, బస్సు సౌకర్యం సరిగా లేక రాత్రి 7 గంటల వరకు ఇంటికి చేరుకోవాల్సి వస్తోంది. మంగళవారం ఈ సమస్యను గ్రామ సర్పంచ్ కుర్లపు గంగాధర్ దృష్టికి తీసుకెళ్లగా, సర్పంచ్ వెంటనే స్పందించి బోధన్ డీఎంకు చరవాణిలో సంప్రదించి సమస్యను పరిష్కరించారు. దింతో విద్యార్థులు హర్షం చేశారు.

## జైల్ భరోను విజయవంతం చేయాలి

### యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.రమేష్ బాబు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఆగస్టు 10న నిర్వహించనున్న దేశ వ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.రమేష్ బాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని, వీజీవీస్ చట్టాన్ని రద్దు చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా విత్తన చట్టం, విద్యుత్ (సవరణ) చట్టాలను రద్దు చేసి, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమానికి పిలుపునిచ్చాయని తెలిపారు. జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, అంగన్వాడీ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని తమ ఐక్యతను చాటాలని, తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే. దేవగంగు, జిల్లా కార్యదర్శి పీ. స్వర్ణ, జిల్లా నాయకులు శివరాజమ్మ, జ్యోతి, రాజ్యలక్ష్మి, సందీప, సరిత, చంద్రకళ, మంజులతో పాటు వివిధ మండలాల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## సీజన్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### మెడికల్ ఆఫీసర్ డా.రక్షిత



ఏర్గట్ల, బతుకమ్మ :వర్షాకాలంలో ప్రబలే మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.రక్షిత తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినుల కోసం మంగళవారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో విద్యార్థినులకు జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి తదితర అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డా.రక్షిత మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ముఖ్యంగా అలాగే హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాధాన్యతను వివరించి, దానిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సంధ్య, హెచ్ఈఓ మోతిరం, హెచ్‌ఎస్ విజయ, హెల్త్ అసిస్టెంట్ పండరి, ఏఎన్‌ఎంలు త్రివేణి, కల్పన, స్వప్న, ఆశా కార్యకర్తలు భారతి, నవ్య, సులోచన, కేజీబీవీ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తగ్గేలి గ్రామంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

### అధికారుల తీరుపై గ్రామస్థుల అనుమానాలు

### ఇసుక అక్రమ వాహనాలు పట్టుకోవాలంటే

### చీత ఫోర్స్ రావాల్సిందేనా ?



సాలూరు, బతుకమ్మ :మంజీర పరివాహక ప్రాంతంలోని తగ్గేలి గ్రామం నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి వేళల్లో డోజర్లతో ఇసుకను డంపింగ్ చేసి, అనంతరం బోలెరో, ట్రాక్టర్లు, తిప్పర్ల ద్వారా బోధన్, ఎడపల్లి, జానకం పేట్ మీదుగా జిల్లా కేంద్రానికి అక్రమంగా తరలిస్తున్నారని వారు చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల విధులు కొనసాగుతున్న ప్రాంతాల గుండా ఇసుక వాహనాలు వెళ్తున్నప్పటికీ వాటిని ఎందుకు అడ్డుకోవడం లేదనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇసుక మాఫియా ఇంత బహిరంగంగా అక్రమ రవాణా సాగిస్తోందంటే వారికి కొంత మంది అధికారుల అండదండలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా ను అరికట్టి డోజర్ సీజ్ చెయ్యాలని పలువురు కోరుతున్నారు.

# తాత్కాలిక వంతెన పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



లింగంపేట్, బతుకమ్మ లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు గ్రామం వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న తాత్కాలిక వంతెన పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వంతెన పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకూడదని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బలమైన నిర్మాణ ప్రమాణాలను పాటించాలని సూచించారు. వంతెన మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, అవసరమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పోలీసు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్, రాజేశ్ చంద్ర, మండల ప్రత్యేక అధికారి సురేందర్, ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) ప్రభాకర్, ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసరావు సిఐ రాజారెడ్డి, తహసీల్దార్ సురేష్ ఎంపీడీవో బ్రహ్మానందం, స్థానిక ఎస్సై దీపక్ కుమార్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రుద్రూర్‌లో ఔషధ మొక్కల దినోత్సవం...

రుద్రూర్, బతుకమ్మ : ఆధునిక ఆయుర్వేద శిరోమణి ఆచార్య బాలకృష్ణ 55వ జన్మదినాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని మహర్షి పతంజలి యజ్ఞ సహిత యోగ ఒ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఔషధ మొక్కల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 4న నిర్వహించే ఈ కార్యక్రమంలో యజ్ఞం, యోగ సాధనతో పాటు ఔషధ మొక్కల నాటడం చేపట్టారు. ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో యజ్ఞం, యోగాభ్యాసం నిర్వహించి, వివిధ రకాల ఔషధ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పతంజలి సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు డా. విశ్వనాథ్ మహాజన్ మాట్లాడుతూ, ఆచార్య బాలకృష్ణ లక్షలాది ఆయుర్వేద వనమూలికలపై




పరిశోధనలు చేసి, ప్రాణాంతక వ్యాధులను సైతం నివారించే శక్తి ఆయుర్వేదంలో ఉందని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని తిప్పతీగ (సంస్కృతంలో అమృతవల్లి -- గిలోయ్)కు చెందిన 55 మొక్కలను గ్రామ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు గోశాలలో గోవులకు దాణా అందజేశారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ మండల అధ్యక్షుడు పుట్టి సాయిబాబా, యువ భారత్ అధ్యక్షుడు పురుషోత్తం, బీఎస్టీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు బెజగం వెంకటేశం గుప్తా, హన్మాండ్లు, తోట గంగన్న, సత్యనారాయణ, పోశెట్టి, గోసేవకులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల రేషన్ కోటాను సజావుగా పంపిణీ చేయాలి

### ఈ నెల 15 లోపు ఈ - కేవైసీ పూర్తి చేయించాలి

### రేషన్ డీలర్లతో సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్ షాపుల) ద్వారా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడు మాసాలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతోందని అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. చౌక ధరల దుకాణ డీలర్లు మూడు మసాల కోటాను దిగుమతి చేసుకుని వినియోగదారులకు సకాలంలో సన్న బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం ఆయా మండలాల రేషన్ డీలర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, ఈ నెల (ఆగస్టు) 31వ తేదీ లోపు రేషన్ పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. బియ్యం పంపిణీలో అవకతవకలు, అలసత్వానికి తావిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వానాకాలం సీజన్‌లో సంభవించే వర్షాలు, వరదలు, నిల్వ సమస్యలు తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. డీలర్లు సమయపాలన పాటిస్తూ, నిర్ణీత గడువు లోపు పంపిణీని పూర్తి చేయాలని, స్టాక్ బోర్డు తప్పక ప్రదర్శించాలని, బియ్యం తూకంలో తేడా ఉండకూడదని సూచించారు. వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అనుచితంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. స్టాక్ నిల్వలు, వాటి వివరాలతో కూడిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం నిల్వలు చేరుకునేలా, కార్డు హోల్డర్లకు వారి కోటా మేరకు ఏకకాలంలో మూడు నెలల పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకులు సక్రమంగా తరలించేలా, బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ-పాస్ యంత్రాలలో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. రేషన్ కోటా కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేసుకునేలా రేషన్ డీలర్లు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. జూలై 31 నాటితో పూర్తయిన గడువును ప్రభుత్వం ఆగస్టు 31 వరకు పొడిగించిందని అన్నారు. ఈ వెసులుబాటును వినియోగించుకుని రేషన్ పొందుతున్న ప్రతి ఒక్కరూ వ- చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గడువు లోపు ఈ-కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కోటా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని ప్రతి సభ్యుడు ఆగస్టు 15వ తేదీ లోపే తప్పక ఈ-కేవైసీ చేసుకునేలా, తద్వారా అర్హులైన వారు రేషన్ కోటా కోల్పోకుండా రేషన్ డీలర్లు ప్రత్యేక చొరవ చూపాలని అదనపు కలెక్టర్ హితవు పలికారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఏ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీ.టీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారంలో సాధన సంస్థ

## న్యూఢిల్లీలో బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారం సమావేశం

నిజామాబాద్ సిటి, బతుకమ్మ :మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సాధన సంస్థ క్షేత్రస్థాయి బాలల హక్కుల సంస్థ అయిన న్యూఢిల్లీలో ప్రారంభించిన దేశవ్యాప్త బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారంలో భాగంగా బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఒక నిర్ణయాత్మక ప్రచారాన్ని ప్రకటించింది. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన "బాలల హక్కులు సామర్థ్యం శ్రేయస్సును నిర్ధారించడం" అనే నాలుగు రోజుల జాతీయ సంప్రదింపుల సందర్భంగా బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారం ప్రారంభించబడింది. బాలల హక్కులను పరిరక్షించడానికి 2030 నాటికి భారతదేశాన్ని మానవ అక్రమ రవాణా రహిత దేశంగా మార్చడానికి కృషి చేస్తున్న 250కి పైగా పౌర సమాజ సంస్థల జాతీయ నెట్‌వర్క్ అయిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జేఆర్ఎస్ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా 782 జిల్లాల నుండి భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఈ సంప్రదింపుల సమావేశంలో పాల్గొన్నారు. సాధన సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ యొక్క భాగస్వామ్య సంస్థ. పిల్లలపై జరిగే నేరాలకు వ్యతిరేకంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రపంచంలోనే అతిపెద్ద న్యాయపరమైన జోక్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దాని భాగస్వామ్య సంస్థల సమిష్టి కృషి ద్వారా ఏప్రిల్ 2023 నుండి డిసెంబర్



2025 మధ్య భారతదేశవ్యాప్తంగా 1,22,516 మంది పిల్లలను మానవ అక్రమ రవాణా నుండి రక్షించడం జరిగిందన్నారు. ఇది సమన్వయంతో కూడిన న్యాయపరమైన చర్యలు, సమాజ ఆధారిత జోక్యాల ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. ఈ సంప్రదింపుల సమావేశాన్ని ప్రారంభిస్తూ కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ మాట్లాడుతూ బాలల రక్షణ అనేది దేశం ఎదుర్కొంటున్న అత్యంత సవాలుతో కూడిన బాధ్యతలలో ఒకటని అభివర్ణించారు. దోపిడీల నుండి పిల్లలను రక్షించడంలో పౌర సమాజ సంస్థలు చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. ఒక్క బిడ్డ ప్రాణాన్ని కాపాడటం కూడా అత్యంత గొప్ప కార్యాలలో ఒకటి. ఎంతో మంది బాలికలు మానవ అక్రమ రవాణాకు బలి అవుతూ తిరిగి ఇంటికి చేరుకోలేకపోతున్నారు. ఈ పిల్లలు తమను ఎవరో ఒకరు రక్షిస్తారని ఎదురుచూస్తుంటారు. వారిని లైంగిక దోపిడీ నుంచి కాపాడే పౌర సమాజ సంస్థల స్వచ్ఛంద కార్యకర్తలు దేవదూతలతో సమానమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా డా.ఆలూరి కామేశ్వరి సాధనా సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలోని పిల్లలకు ఎదురయ్యే అత్యంత తీవ్రమైన ముప్పులలో బాలల అక్రమ రవాణా ఒకటిగా కొనసాగుతోందని అన్నారు. "సగటున ప్రతిరోజూ ఆరుగురు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతుండగా ఐదుగురు పిల్లలను బలవంతపు చాకిరీలోకి నెడుతున్నారనేది ఒక విషాద వాస్తవమన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతి గంటకు 11 మంది పిల్లలు అదృశ్యమవుతున్నారన్నారు. వారిలో గణనీయమైన సంఖ్యలో అక్రమ రవాణా బాధితులుగా మారుతున్నారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా తర్వాత ప్రపంచంలో మూడవ అతిపెద్ద వ్యవస్థీకృత నేరం మానవ అక్రమ రవాణా, మహిళలు, పిల్లలే దీనికి ప్రధాన లక్ష్యాలుగా ఉంటున్నారు. అక్రమ రవాణాదారులు వాణిజ్య లైంగిక దోపిడీ వెట్టిచాకిరి ద్వారా లాభాలు పొందుతున్నారు. అసంఘటిత రంగంలోని బాల కార్మిక వ్యవస్థ అక్రమ రవాణా యొక్క అత్యంత దారుణమైన రూపాలలో ఒకటన్నారు.

# దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి

## గుమస్తా కాలనీలో ఘనంగా శ్రీశ్రీశ్రీ దుర్గమ్మ బోనాల మహోత్సవం

### ఆలయ అధ్యక్షులు ఆమంద్ విజయ్ కృష్ణ





నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ భక్తి, ఐక్యత, సేవాభావాలను పెంపొందిస్తుందని, జగజ్జనని దుర్గమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఇందూరు నగర ప్రజలందరిపై, గుమస్తా కాలనీ వాసులపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నామని ఆలయ అధ్యక్షులు ఆమంద్ విజయ్ కృష్ణ తెలిపారు. నగరంలోని గుమస్తా కాలనీలో దుర్గాదేవి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గమ్మ బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆర్యన్ తివారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. యువత, చిన్నారులు, కాలనీ వాసులు భారీగా పాల్గొనగా, డప్పు వాయిద్యాలు, బోనాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమాజంలో సనాతన ధర్మ పరిరక్షణ, భారతీయ సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గుమస్తా కాలనీ ప్రజలు ప్రతి సంవత్సరం ఇదే ఉత్సాహంతో బోనాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. దుర్గమ్మ తల్లి అనుగ్రహంతో ఇందూరు నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, యువత మంచి మార్గంలో పయనించాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, వ్యాపారులు అభివృద్ధి చెందాలని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటిలో ఆనందం, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి బోడికే బాబురావు, కోశాధికారి ధాత్రిక వేణుగోపాల్, లవంగ సదాశివ, ఉపాధ్యక్షులు మాదూరి కిషన్, శ్రీకరి సంతోష్, గంగోనే అనిల్, కార్యదర్శి ఆమంద్ వెంకట్, చోటే రాజేష్, సలహాదారులు ధాత్రిక రాజేందర్, కార్యవర్గ సభ్యులు గంగోనే సంతోష్, మెడికల్ శ్రీనివాస్, ధాత్రిక ప్రవీణ్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దుర్గమ్మ తల్లి ఆశీస్సులు పొందారు.

# ఎస్ఆర్ సర్వేను పూర్తి చేసిన వారి సేవలు అభినందనీయం

## నందిపేట్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఎర్రం లింగం

నందిపేట్, బతుకమ్మ :గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరు వివరాలను సేకరించి, బాధ్యతాయుతంగా ఎస్ఐఆర్ సర్వేను పూర్తి చేసిన బీఎల్ఓలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయమని నందిపేట్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం కొనియాడారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వేను విజయవంతంగా 100 శాతం పూర్తి చేసిన బీఎల్ఓలు, వీవోలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లను మంగళవారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిపేట్ గ్రామం సుమారు 10,200 మందికి పైగా ఓటర్లతో ఉన్న అతిపెద్ద గ్రామ పంచాయతీలలో ఒకటని తెలిపారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే సర్వేను నిర్దేశిత సమయంలో 100 శాతం పూర్తి చేయడం సాధ్యమైందని ఆయన ప్రశంసించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటరు జాబితా సవరణకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందిపేట్ ఉపసర్పంచ్ చందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు చింత శ్రీనివాస్, పెట్ల శ్రీనివాస్, బీఎల్ఓలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# బొప్పాపూర్‌లో ఘనంగా బోనాల పండుగ...



రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గ్రామస్తులు మంగళవారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని పోచమ్మ ఆలయం నుండి బారేడు పోచమ్మ ఆలయం వరకు డప్పు చప్పులతో, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా తరలి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యాలు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పట్ల సురేష్, పట్ల సంతోష్, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్ల శ్రీకాంత్, నాయకులు కొత్తపల్లి రవి కిరణ్, సిరిగిరి శేఖర్, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు సకాలంలో వ్యాక్సినేషన్ చేపట్టాలి

## గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి



ఏర్గట్ల, బతుకమ్మ :ప్రస్తుతం సీజనల్‌గా పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర పెంపుడు జంతువుల్లో వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వాటి నివారణకు అవసరమైన వ్యాక్సినేషన్‌ను సకాలంలో నిర్వహించాలని గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి పశువైద్యశాల అధికారులను ఆదేశించారు. ఏర్గట్ల గ్రామంలోని పశువైద్యశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల పనితీరు, పశువులకు అందుతున్న వైద్య సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరాలను నిర్వహించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి పశుపాలకుడికి వ్యాక్సినేషన్ సేవలు చేరేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్న సర్పంచ్, ఏర్గట్ల గ్రామంలోని ప్రతి పశుపాలకుడు ప్రభుత్వం నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అధికారి నరేందర్, గ్రామ యాదవ సంఘ సభ్యులు, పశువైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయాల పరిష్కారానికి హైడ్రాలిక్ లిఫ్టర్

. . . వేగవంతమైన విద్యుత్ సేవల కోసం టీజీఎన్‌పీడీసీఎల్ చర్యలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ నగరంలో విద్యుత్ అంతరాయాలను త్వరితగతిన పరిష్కరించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ కొత్తగా హైడ్రాలిక్ లిఫ్టర్ వాహన సేవలను ప్రారంభించింది. వినియోగదారులకు మరింత నాణ్యమైన, వేగవంతమైన విద్యుత్ సేవలను అందించాలనే లక్ష్యంతో నిజామాబాద్ ఆపరేషన్ సర్కిల్ పరిధిలో టాటా యోధా 3.0 ఎంటీ హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు. ఈ వాహనం సహాయంతో 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల బ్రేక్‌డౌన్‌లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ (ఎఫ్ఓసి), చెట్ల కొమ్మల తొలగింపు, అలాగే ఎత్తైన ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ లైన్లు, పరికరాల నిర్వహణ పనులను మరింత సురక్షితంగా, వేగంగా చేపట్టేందుకు వీలు కలుగుతుంది. ముఖ్యంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడిన సమయంలో ఈ హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనం ద్వారా సిబ్బంది తక్షణమే స్పందించి సరఫరాను త్వరగా పునరుద్ధరించగలరని అధికారులు తెలిపారు. అంతే కాకుండా విద్యుత్ సిబ్బంది భద్రతకు కూడా ఈ వాహనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అత్యవసర నిర్వహణ పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఈ హైడ్రాలిక్ లిఫ్టర్ వాహనం కీలకంగా ఉపయోగపడుతుందని సూపరింటెండింగ్ ఇంజనీర్ వెల్లడించారు.



## అరే కటికే సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలు..

### అమ్మవారికి బోనం సమర్పించిన ఎమ్మెల్యే పోచారం



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, మున్సిపల్ చైర్ పర్సన్ కాసుల విజయ హాజరై బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల్లో బోనాల పండుగ ఒకటని, ప్రతీ సంవత్సరం ఆషాఢమాసంలో ఊరూరా బోనాల పండుగ నిర్వహించి, ప్రజలు తమ మొక్కులను తీర్చుకుంటారని ఆయన అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురియాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అరే కటికే సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు కటికె రమేష్, హకీమ్, కోఆప్షన్ సభ్యులు కాసుల రోహిత్, ఖామర్ సుల్తానా గౌస్ పాషా, నాయకులు, నార్ల సురేష్, దాసరి శ్రీను, వాహబ్, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

### ముర్రిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం



మోర్తాడ్, బతుకమ్మ :పుట్టిన శిశువుకు గంటలోపు తల్లిపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని, ముఖ్యంగా ముర్రిపాలు (కొలస్ట్రం) శిశువుకు అమూల్యమైన పోషకాహారమని అంగన్‌వాడీ టీచర్ సుజాత పేర్కొన్నారు. ముర్రిపాల వల్ల చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని ఆమె వివరించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం మోర్తాడ్ మండలంలోని డోల్‌పాల్ గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుకు తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వాల్సిన అవసరం, ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలే అందించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, ఐకేపీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తగిలి మేక మృతి

### మరో మేకకు గాయాలు



కామారెడ్డి, బతుకమ్మ :విద్యుత్ ప్రమాదం చోటుచేసుకుని ఓ మేక మృతి చెందగా, మరో మేకకు గాయాలైన ఘటన ఆరేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, బైకారి మల్లయ్య తన మేకలను మేతకు తీసుకెళ్లగా, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో రక్షణ కంచె లేకపోవడంతో విద్యుత్ వైరు తెగిపడి మేకలపై పడింది. దీంతో సుమారు రూ.15 వేల విలువైన ఒక మేక అక్కడికక్కడే మృతి చెందింది. మరో మేకకు తీవ్ర గాయాలు కావడంతో వెటర్నరీ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితుడు బైకారి మల్లయ్య మాట్లాడుతూ, విద్యుత్ వైర్లు తెగిపడటంతో తన మేక మృతి చెందిందని, మరో మేక గాయపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో తనకు కూడా ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించిన మల్లయ్య, జరిగిన నష్టానికి విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా విద్యుత్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# మాతృ మరణాలను నివారించేందుకు సమన్వయంతో పని చేయాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డా.బి.రాజశ్రీ





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మాతృ మరణాలను పూర్తిగా నివారించేందుకు అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంసీహెచ్ సూపర్వైజర్లు ప్రతి గర్భిణీ స్త్రీని గర్భం దాల్చిన 12 వారాల్లోపు నమోదు చేయడంతో పాటు కనీసం నాలుగు సార్లు వైద్యులచే పరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణీలకు ధనుర్వాతం రాకుండా అవసరమైన టీకాలు అందించాలని, ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణీకి ఎత్తు, బరువు, రక్తపోటు, హిమోగ్లోబిన్ (హెచ్‌బీ), రక్తహీనత వంటి సాధారణ పరీక్షలతో పాటు హైపర్ టెన్షన్, ప్లేట్లెట్స్ తదితర పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రమాదాలను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రసవం కోసం ముందస్తు ప్రసవ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సాధారణ ప్రసవాల కోసం తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే, ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణీలను స్త్రీ వైద్య నిపుణులు అందుబాటులో ఉన్న ఆసుపత్రులకు రిఫర్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ప్రసవ సమయానికి గర్భిణీల వెంట ఆశా కార్యకర్తలు తప్పనిసరిగా ఉండి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. "మదర్ ఇన్ - మదర్ అవుట్" కార్యక్రమంలో భాగంగా గర్భిణీల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి, ఫోన్ ద్వారా అందించే ఆరోగ్య సేవలను గుర్తించి నమోదు చేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఎల్‌ఎంపీ, ఈడీడీ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. మాతృ మరణం సంభవించకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని, అనివార్య పరిస్థితుల్లో ఎక్కడైనా మాతృ మరణం జరిగితే గర్భిణీ ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ కారణాలు, డాక్యుమెంటేషన్ వంటి పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ఆసుపత్రి స్థాయి ఆడిట్‌తో పాటు సామాజిక స్థాయి ఆడిట్ నిర్వహించి, మాతృ మరణాల నమోదు ఫార్మాట్‌లో పూర్తి వివరాలను పొందుపరచాలని సూచించారు. కుటుంబ సభ్యుల నిర్లక్ష్యం, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో లోపాల కారణంగా ఒక్క మాతృ మరణం కూడా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డాక్టర్ రాజశ్రీ పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మాతృ మరణాలు నమోదైన మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అయిన మాలపల్లి, సిరికొండ, గౌతమ్ నగర్‌లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ సికందర్ నాయక్, ప్రొఫెసర్ డాక్టర్ ఉమ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బి. ఇందు, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శాలిని, డాక్టర్ వనిత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శిఖరా, ఎస్‌వో రాజేశ్వర్, డిప్యూటీ డెమో దుర్గారావు, డీహెచ్ఈలు గన్‌పూర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డా.అరవింద్, డా.రాణా ప్రతాప్, డా.శరత్ చంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షణ అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవనశైలి వ్యాధులను ముందస్తుగా గుర్తించాలి

### స్క్రీనింగ్ పరీక్షలను విస్తృతంగా నిర్వహించాలి......జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలను విస్తృతంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై మంగళవారం డీఎంహెచ్‌వో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జీవనశైలి వ్యాధుల నియంత్రణలో భాగంగా ఆయుష్మాన్ భారత్ (ఆభా) కార్డు జనరేషన్‌ను వేగవంతం చేయాలని, హైపర్‌టెన్షన్, డయాబెటిస్ నిర్ధారణ పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించారు. అలాగే ఎంసీహెచ్, ఎన్‌సీడీ, యూవిన్, ఆమ్ పోర్టల్‌లలో నమోదులను పూర్తి చేయడంతో పాటు, ఆబాస్ అటెండెన్స్‌ను 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 30 సంవత్సరాలు పైబడిన జనాభా సుమారు 52 శాతం ఉన్నందున, వారికి హైపర్‌టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. టీకాల ద్వారా నివారించగల వ్యాధుల నియంత్రణలో భాగంగా పోలియో, మీజిల్స్ అనుమానిత కేసులకు సంబంధించిన నమూనాలను సకాలంలో పంపించాలని సూచించారు. అత్యంత ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి, ప్రసవ ప్రణాళిక రూపొందించి, సురక్షిత ప్రసవం కోసం అవసరమైన ఆసుపత్రులకు రిఫర్ చేయాలని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ కనీసం 60 మంది వరకు ఓపీ సేవలు అందేలా చూడాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా అందించే అన్ని సేవలు గ్రామస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ



సమీక్ష సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డా.వెంకన్న, డా.శిఖర, డా.వెంకటేష్, డా.శ్రావ్య, ఎస్ఓ రాజేశ్వర్, డీపీఓ విశాల, డీహెచ్ఈ ఘనపూర్ వెంకటేశ్వర్లు, డీడీఎం పృథ్వీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు నేపథ్యంలో కోతకు గురవుతున్న రోడ్డు

### ప్రమాదాలకు నిలయంగా ధర్పల్లి వైపు వెళ్లే రోడ్డు పట్టించుకోని అధికారులు



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రం నుండి ధర్పల్లి, సిరికొండ, భీంగల్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డుకు భారీ వర్షం నేపథ్యంలో రోడ్డు పూర్తిగా కూతకు గురి కావడంతో అతి ప్రమాదకరంగా మారింది కానీ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు గానీ పంచాయతీ అధికారులు గాని కోతకు గురైన రోడ్డుకు కంచె వేయడం కానీ మరమ్మత్తులు చేయడం కానీ మరిచిపోయారు. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రయాణికులకు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ మేరకు ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన పలువురు ప్రజలు మాట్లాడుతూ ధర్పల్లి వైపు వెళ్లే రోడ్డు ఇరువైపులా భారీ వర్షాల నేపథ్యంలో కోతకు గురి కాగా సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ లక్షలాది వేతనాలు పోతున్న అధికారులు ప్రజల ప్రాణాలను కాపాడాల్సింది పోయి వారి ప్రాణాలతో చెలగాటమాడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అతి భారీ వర్షాలు నేపథ్యంలో ధర్పల్లి వైపు వెళ్లే రోడ్డు వర్షపు నీటికి కోతకు గురైందని గుర్తు చేశారు. ప్రయాణికుల భద్రతే ముఖ్యంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

## టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ పట్టణంలో అరె కటిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బోనాల మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో పండుగలను నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. బోనాల వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అరె కటిక సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని





ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి రామకృష్ణ, మల్లికార్జున్, కార్పొరేషన్ చైర్మన్లు శేఖర్ గౌడ్, కేశ వేణు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# వర్షం నీటిలో ఆదిత్య పాఠశాల...

## వర్షానికి తేలిపోయిన సౌకర్యాలు
## తల్లిదండ్రుల ఆగ్రహం

బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలోని ఆదిత్య పాఠశాల ఆవరణలో గత రెండు రోజుల కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ వర్షపు నీటి పారుదల కోసం తగిన ఏర్పాట్లు లేకపోవడంపై తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలను పూర్తిగా అనుమతి లేని వెంచర్లలో చివరికి ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అనుమతి ఎన్జీవోస్ కాలనీలో అయితే పాఠశాల నిర్వహణ సాయి కృప నాగర్



కాలనీలో కొనసాగడం పట్ల మండల జిల్లా విద్యాశాఖ అధికారులకు అటు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయడం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండటంతో విద్యార్థుల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు



పూర్తిగా వర్షాప్ నీటిలో మునిగిపోయి ఉండడంతో పిల్లలు నిరాశకు గురికాగా తప్పలేదు. అదేవిధంగా పాఠశాలలో నీరు నిల్వ ఉండడంతో దోమల వ్యాపించి సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు, విద్యాశాఖ అధికారులు స్పందించి పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే పాఠశాల యాజమాన్యం కూడా నీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సనాతన హిందూ ధర్మంపై అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశం

## సద్గురు మహాదేవ స్వామీజీ

బాన్సువాడ, బతుకమ్మ :సనాతన హిందూ ధర్మంపై ప్రజల్లో అవగాహన, జాగృతిని కల్పించడమే మహాసభ ప్రధాన ఉద్దేశమని సద్గురు మహాదేవ స్వామీజీ పేర్కొన్నారు. బాన్సువాడ పట్టణంలోని పాత బాన్సువాడ హనుమాన్ మందిరంలో సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం సద్గురు ఆధ్వర్యంలో విడుదల చేశారు. అంతకుముందు మహాసభ నిర్వహణకు సంబంధించి సన్నాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బాన్సువాడ పట్టణంలోని రెడ్డి సంఘంలో సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభను విజయవంతం చేసేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సనాతన ధర్మాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని స్వామీజీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, హిందూ ధర్మాభిమానులు, సన్నాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలి

## ముత్యాల సునీల్ కుమార్

మెండోర, బతుకమ్మ :ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం కంటే నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ కుమార్ పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిగా కనీస బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. మెండోర మండల కేంద్రంలోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2017 మే నెలలో ప్రారంభమైన ఈ నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడం పట్ల ప్రశ్నించారు. గతంలో ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన ప్రశాంత్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యేగా మూడు సంవత్సరాలు గడిచినా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించలేకపోయారని విమర్శించారు. రెండు పడక గదుల సముదాయంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన సమయంలో విమర్శలకే పరిమితం కావడం సరికాదని అన్నారు. ప్రభుత్వ పెద్దలను కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని ప్రశాంత్ రెడ్డికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై తాను బాధ్యతగా మండల రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే ఈ సమావేశాలపై ఎమ్మార్వోల విషయంలో జిల్లా కలెక్టర్‌కు ప్రశాంత్ రెడ్డి ఫిర్యాదు చేయడం సరికాదని విమర్శించారు. “ఆయన పని చేయరు.. పని చేసేవారిని



చేయనివ్వరు” అంటూ ఆరోపించారు. ప్రజల కోసం ప్రశాంత్ రెడ్డి పిలిస్తే ఎలాంటి భేషజాలు లేకుండా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే ఎలాంటి పనులు చేయకుండా పదేపదే తప్పుడు విమర్శలు చేస్తే బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# పదోన్నతిపై వెళ్తున్న రమేష్‌కు వీడ్కోలు



బాల్కొండ, బతుకమ్మ :బాల్కొండ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా నాలుగున్నర సంవత్సరాలు విధులు నిర్వహించిన కత్రాజీ రమేష్ సేవలు అభినందనీయమని బాల్కొండ తహసీల్దార్ శ్రీనివాస్ కొనియాడారు. డిప్యూటీ తహసీల్దారుగా పదోన్నతి పై ఏర్గట్ల మండలానికి బదిలీపై వెళ్తున్న కత్రాజి రమేష్ ను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు పదోన్నతులు సహజమని, ఎక్కడ విధులు నిర్వహించిన అక్కడి ప్రజలకు మంచి సేవలు అందించి, మంచి గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వనజ, ఆర్ఐ గంగాదర్, జిపివోలు, వీఆర్ఏలు కార్యాలయం సిబ్బంది, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్య సాధనలో ముందుండాలి

## బాల్కొండ సర్పంచ్ గాండ్ల రాజేష్




బాల్కొండ, బతుకమ్మ :విద్యార్థులు లక్ష్య సాధనలో ముందుండి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని బాల్కొండ గ్రామ పంచాయితీ సర్పంచ్ గాండ్ల రాజేష్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అదే విధంగా ఆదర్శ పాఠశాలలో జరిగిన ఎన్నికలలో ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్ లను ప్రశంసించి సన్మానించారు. అనంతరం ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయ బృందం అన్ని విధాల తోడ్పాటు అందిస్తుందని, రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. తదనంతరం విద్యార్థులు పాటలు, డ్యాన్స్‌లతో సందడి చేయడం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ గణేష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, బతుకమ్మ :మల్యాల ఎస్సీ హాస్టల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటనలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఘటన విషయం తెలిసిన వెంటనే అధికారులను అప్రమత్తం చేసి, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల మృతితో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాలకు మంత్రి అండగా నిలిచారు. ప్రమాదం జరిగిన సమయం నుంచి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ బాధిత కుటుంబాలకు సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే కుటుంబంలో ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా రూ.25 వేల నగదును అందించడంతో పాటు, మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు ప్రభుత్వ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయించారు. బాధిత కుటుంబాల పట్ల మంత్రి స్పందించిన తీరు, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసిన విధానంపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై తక్షణ స్పందనతో పాటు, ఆపద సమయంలో అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.

## మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### సర్పంచ్ లోకని గంగామణి గంగారం



ఇందల్వాయి, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళ సంఘాల సభ్యులు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇందల్వాయి సర్పంచ్ లోకని గంగామణి గంగారం సూచించారు. ఈ మేరకు మంగళవారం గ్రామ సచివాలయం ముందు డ్వాక్రా మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డ్వాక్రా సంఘం మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మొక్కల సంరక్షణ భావితరాలకు వరమని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు వనమహోత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకొని నీటి వృధాను అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు, సింగిల్ విండో చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ రియాజ్, వైస్ చైర్మన్ బాగిర్తి నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భరత్, కరోబార్ పోచయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ జగ్గా రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించాలి

### నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, బతుకమ్మ :పాలమూరు – రంగారెడ్డి, సీతారామ సాగర్, దిండి, గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టులకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రక్రియను వేగవంతం చేయాలని సూచిస్తూ, 7 రోజుల్లో నోడల్ అధికారుల నియామకం, 30 రోజుల్లో నివేదికల సమర్పణకు గడువులు విధించారు. అలాగే గౌరవెల్లి పంప్‌హౌస్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగే ముంపుపై శాస్త్రీయ అధ్యయనం చేసి కేంద్రం నుంచి పరిహారం కోరాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు

## హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు...

### ఆస్తి, భూ వివాదాలే హత్యకు కారణం

### పటిష్ట సాక్ష్యాలతో రుజువైన నేరం

బాన్సువాడ, బతుకమ్మ :పదేళ్లుగా కొనసాగుతున్న ఆస్తి, భూ వివాదాలు చివరకు దారుణ హత్యకు దారితీశాయి. ఈ కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా కూడా విధించింది. బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ హత్య కేసులో పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టారు. సాక్షుల వాంగ్మూలాలు, శాస్త్రీయ ఆధారాలు, పక్కా సాక్ష్యాధారాలను సేకరించి నిందితులపై నేరాన్ని రుజువు చేసేలా దర్యాప్తు పూర్తి చేశారు. పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు ఫలితంగానే ఇద్దరు నిందితులకు కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది.కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి,పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అభినందించారు. జిల్లాలో నేరాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఎస్పీ స్పష్టం చేశారు. సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో నేరస్తులకు శిక్ష పడేలా కామారెడ్డి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.



# సమాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

### మసాయిపేట యాదగిరి మాదిగ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మసాయిపేట యాదగిరి మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఎస్సీ వర్గీకరణ కోసం రాజీలేని పోరాటం సాగించిందని తెలిపారు. మాదిగలతో పాటు పేద, అణగారిన వర్గాల సంక్షేమం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి పలు సంక్షేమ పథకాలను సాధించడంలో ఉద్యమం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని ఆయనన్నారు. మహనీయుల ఆశయాలు, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, అన్ని గ్రామాలు, బస్తీల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఏర్పాటు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా యాదగిరి మాదిగ మాట్లాడుతూ, దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ కారణంగా అనేక వర్గాలు వివక్షకు గురై పేదరికంలోనే మిగిలిపోయాయని అన్నారు. అణగారిన వర్గాల ఆర్థిక అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజకీయ చైతన్యాన్ని కోల్పోకుండా ప్రజా సమస్యలపై పోరాటాలు




నిర్మించాలని కార్యకర్తలకు సూచించారు. ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల కమిటీలు రద్దైన నేపథ్యంలో గ్రామ, పట్టణ స్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి సంస్థాగతంగా పునర్నిర్మాణం చేపట్టాలని ఆయన తెలిపారు. నూతన విద్యార్థి, యువతను ఉద్యమంలోకి తీసుకువచ్చి శక్తివంతమైన శ్రేణులుగా తీర్చిదిద్దేందుకు కార్యకర్తలు కృషి చేయాలనీ కోరారు. ఈ సమావేశానికి ఎంఎస్పీ, ఎంఆర్పీఎస్ నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి సరికేల పోశెట్టి మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కో-ఇన్‌చార్జిలు పేదిగిరి మహేష్, తేడు గంగారాం, రేణిగుంట నాంపల్లి, జిల్లా మహిళా నాయకురాలు గుంట పద్మ, రాహుల్, రాజేష్, నవీన్, యాదగిరి, రూరల్ ఇన్‌చార్జి నాగభూషణం, నిజామాబాద్ ఉమ్మడి విద్యార్థి ఇన్‌చార్జి బైరిపోగు శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కోటి రూపాయల వంతెన వర్షార్పణం


లింగంపేట, బతుకమ్మ:ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో లింగంపేట మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో పాముల వాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన వరద ఉధృతికి కోతకు గురైంది. దీంతో కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం వరకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడంతో పాటు పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. సోమవారం రాత్రి లింగంపేట, గాంధారి మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో పాములవాగుతో పాటు అనేక వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పాములవాగుకు ఒక్కసారిగా భారీగా వరద నీరు చేరడంతో తాత్కాలిక వంతెనపై ఒత్తిడి పెరిగింది. వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన భారీ చెట్ల దుంగలు, ముళ్ల పొదలు, చెత్తాచెదారం వంతెన నిర్మాణానికి ఉపయోగించిన సిమెంట్ పైపులకు అడ్డంగా చిక్కుకుపోయాయి. దీంతో నీటి ప్రవాహం సజావుగా సాగక, వరద నీరు రహదారిపై నుంచి ప్రవహించింది. ఫలితంగా



తాత్కాలిక వంతెనకు గండిపడి రహదారి కోతకు గురైంది. దీంతో కామారెడ్డి – ఎల్లారెడ్డి మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఉద్యోగులు, విద్యార్థులు, అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రయత్నించగా, మరికొందరు వరద తగ్గే వరకు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది ఆగస్టు చివరి వారంలో కురిసిన భారీ వర్షాల సమయంలో కూడా ఇదే పాములవాగు వంతెన వరద తాకిడికి పూర్తిగా కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ సమయం లో జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి పాములవాగును సందర్శించి, తక్షణ తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.1 కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వంతెన దెబ్బతినడంతో దాదాపు రెండు నెలల పాటు కామారెడ్డి--ఎల్లారెడ్డి మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. తదనంతరం స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రత్యేక చొరవ తీసుకుని మరో రూ.1 కోటి నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో పాములవాగులో సిమెంట్ పైపులు ఏర్పాటు చేసి, వాటిపై మొరం పోసి తాత్కాలిక వంతెన నిర్మించారు. అప్పటి నుంచి వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడినప్పటికీ, ఈ ఏడాది మరో సారి భారీ వరదల ధాటికి అదే వంతెన కోతకు గురికావడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇదిలా ఉండగా, పాములవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లింగంపేట మండలంలోని ఐలాపూర్ – రాంపల్లి గ్రామాల మధ్య ఉన్న లో – లెవెల్ వంతెన కూడా వరద నీటిలో మునిగిపోయింది. వంతెనపై నుంచి భారీగా నీరు ప్రవహించడంతో అధికారులు ఆ మార్గంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తూ వంతెనల వద్దకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో పాములవాగు వరదల కారణంగా ఇదే సమస్య పునరావృతమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక వంతెనలతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని, ప్రజల ప్రాణాలు, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పాములవాగుపై శాశ్వత హై-లెవెల్ వంతెన నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# మెగా రక్తదాన శిబిరం కరపత్రాల ఆవిష్కరణ

బీబీపేట, బతుకమ్మ :తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను బీబీపేట మండల కేంద్రంలోని వాసవి క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించారు. వాసవి క్లబ్ బీబీపేట, కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్), మణికంఠ భారత్ గ్యాస్ ఏజెన్సీ వారి సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీబీపేట ఎస్ఐ నవీన్ చంద్ర, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం అవుతుందని తెలిపారు. జీవితాంతం రక్తంపై ఆధారపడే ఈ చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. మెగా రక్తదాన శిబిరానికి సహకరిస్తున్న వాసవి క్లబ్ బీబీపేట, మణికంఠ భారత్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి తలసేమియా చిన్నారుల జీవితాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల



సమూహం అధ్యక్షుడు ఎండీ జమీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, వాసవి క్లబ్ వైస్ గవర్నర్ భాశెట్టి నాగేశ్వర్, అధ్యక్షుడు మురికి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రెడిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి జోర్రిగల శ్రీనివాస్, వైశ్య సంఘం కార్యదర్శి ఇల్లందుల ఆంజనేయులు, కోశాధికారి తొడుపునూరి శ్రీనివాస్, బచ్చు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.